క్లుప్తంగా

రామాలయానికి రూ.50 వేలు వితరణ



రామాలయ నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న జయచంద్రారెడ్డి

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి అల్లపురెడ్డి జయచంద్రారెడ్డి రూ.50,116లు విరాళంగా అందజేశారని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహదేవపల్లె మాజీ సర్పంచ్ రామచంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె గ్రామంలో బుధవారం శ్రీ గురు దత్తాత్రేయ జయంతి సందర్భంగా ఆరు పళ్ల వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30,000 మొదలుకుని 5 బహుమతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9849322859, 9963223076 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధన

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో సోమవారం కాశిరెడ్డి నాయన ఆలయంలో కాశిరెడ్డినాయన ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల తాళాల భజన అందరిని ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గురువు లక్కసముద్రం నారాయణ బృందం నిర్వహించిన గొప్ప ఉచిత నాటక ప్రదర్శన అందరిని అలరించింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : పులివెందులలోని రవీంద్రనాథ ఉన్నత పాఠశాలలో 1992–93 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం స్థానిక పులివెందుల పట్టణంలోని వైఎస్ పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు చూపించిన శ్రద్ధ వల్ల తాము ఈస్థాయిలో ఉన్నామని విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వికసిత భారత్ సంకల్ప యాత్ర

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లె, పెద్దకుడాల పంచాయతీ గ్రామాల్లో మంగళవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కర్ణపాపాయపల్లె, మధ్యాహ్నం 2గంటలకు పెద్దకుడాల గ్రామంలో ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని.. మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు, అన్ని శాఖల అధికారులు తగిన నివేదికలతో విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలి



ముఖ్యమంత్రికి వివరిస్తున్న ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో ఉన్న అతి పురాతన ఆలయమైన సంగమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కోరినట్లు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. మహానేత రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆలయ ప్రాంగణంలో ఏపీ టూరిజం అతిథిగృహం నిర్మించారని గుర్తు చేశానన్నారు. ఆలయ అభివృద్ధిపై సానుకూలంగా స్పందించిన ఆయన తమ వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తానన్నారని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కమలాపురం : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వీఎన్‌పల్లె : ఉరుటూరు చర్చిలో ఏర్పాటు చేసిన క్రీస్తు జన్మించిన పశువులపాక

పులివెందుల టౌన్ : పట్టణంలో క్రిస్మస్ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి, రాక్ చర్చి, బేతేలు చర్చిలతోపాటు పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాస్టర్లు యేసు క్రీస్తు వృత్తాంతాన్ని చదివి వినిపించారు. పండుగ పర్వదినం గురించి వివరించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక సీఎస్ఐ చర్చి, కడప–పులివెందుల రోడ్డులోని మదర్‌థెరిస్సా ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రార్థనా మందిరానికి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసి 2024 సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఏసుప్రభువును వేడుకున్నారు. ఫాస్టర్లు బాలస్వామి, సత్యమయ్యలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఇంటి ముందు క్రిస్మస్ స్టార్లను, విద్యుత్ వెలుగు దీపాలతో అలంకరించారు. కొంతమంది చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు.

లింగాలలో..

లింగాల : మండల కేంద్రంలోని బేతేలు చర్చిలో ఫాస్టర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పార్నపల్లె, పెద్దకుడాల, కోమన్నూతల, ఇప్పట్ల, దొండ్లవాగు తదితర గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సింహాద్రిపురం రెహెబోతు ప్రార్థనా మందిరంతో పాటు పలు చర్చిల్లో క్రిస్మస్ పర్వదినాన పురస్కరించుకుని ఫాస్టర్ డి.సాల్మన్ రాజ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన దైవ సహాయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవ సోదరుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మానవుల రక్షణకై అవతరించిన లోకరక్షకుడు ఏసు క్రీస్తు అని సీఎస్ఐ చర్చి ఫాస్టర్ భరత్ హెరాల్డ్ తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆర్‌సీఎం, నిస్సీ, టీసీసీ(తెలుగు చర్చ్ కౌన్సిల్), టీసీసీ టౌన్‌చర్చ్, రెహెబోతు, మన్నా, హోసన్నా, షిలోహు, యెరూషలేము, షాలేము చర్చిలతో పాటు పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, గంగవరం, విభరాపురం, సంబటూరు, కోగటం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, చదిపిరాళ్ల, రామచంద్రాపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల్లోని ఫాస్టర్లు క్రీస్తు సందేశం అందించారు. సాయంత్రం వివిధ చర్చి ప్రాంగణాల్లో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు విశేషంగా అలరించాయి.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవ కుటుంబాలు చర్చిలకు చేరుకున్నాయి. పశువుల పాకలను ఏర్పాటు చేసి ఏసు జననాన్ని స్మరించుకుంటూ ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ మత బోధకులు సందేశాలను అందించారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అనంతరం ఏసు ప్రభువు గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలువురు క్రిస్మస్ తాత వేషంలో అలరించారు. మండలంలోని వల్లూరు, గణేష్‌పురం, మిట్టపల్లె, కుమారునిపల్లె, తోల్లగంగనపల్లె, పెద్దలేబాక, పాపాగ్నినగర్, బాలుగారిపల్లె, పైడికాలువలో ఘనంగా జరుపుకున్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వెల్లటూరు, చెన్నంరాజుపల్లె, పాతసంగటిపల్లె, చీమలపెంట, చౌటపల్లె, నందిమండలం, మాచునూరు, తుమ్మలూరు, దర్బార్‌పేట దళితవాడల్లోని పలు చర్చిల్లో ఉదయాన్నే క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని కేక్‌లను కట్ చేసి బంధుమిత్రులతో విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఉరుటూరు, పాయసంపల్లె, కొమ్మద్ది, వెల్దుర్తి, వీరపునాయునిపల్లె, అడవిచెర్లోపల్లె, బుసిరెడ్డిపల్లె, ఎన్.పాలగిరి, గంగిరెడ్డిపల్లె, అనిమెల, తంగెడుపల్లె, యు.రాజుపాలెం తదితర గ్రామాల్లోని చర్చిలలో ఫాస్టర్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. నూతన వస్త్రములు ధరించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక టౌన్ చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఫాస్టర్లు దైవ సందేశం ఇచ్చారు. ఆదేవిధంగా ఆర్‌సీఎం, ఎస్పీజీ క్వార్టర్స్‌లోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చి, కేథలిక్ చర్చి తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాస్టర్లు రెవరెండ్ జి.అరుణ్‌బాబు, థామస్ ప్రసాద్‌రావులు సందేశం ఇచ్చారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని సీఎస్ఐ చర్చిల్లో క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెడుదూరు, కొండాపురం, లావనూరు గ్రామాల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. సాయంత్రం చర్చిల వద్ద ఆటపోటీలను నిర్వహించారు.



కమలాపురంలో సందేశం వింటున్న భక్తులు



సింహాద్రిపురంలో ప్రార్థనల్లో ..



వల్లూరు : ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



జమ్మలమడుగులో ప్రార్థనలు చేస్తున్న ..



వీరపునాయునిపల్లెలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సీఎం చేతులమీదుగా పుస్తకావిష్కరణ



అరవిందనాథరెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్, తదితరులు

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సింహాద్రిపురం పర్యటనలో భాగంగా దివారం ×అరవిందనాథరెడ్డి జీవిత ప్రస్థానం× అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రూపకర్త అరవిందనాథరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబంతో నా అనుబంధం, జీవిత ప్రస్థానంలో వైఎస్సార్ కుటుంబం వ్యవస్థ, నాతో వైఎస్సార్‌కు ఉన్న అనుబంధం, జీవిత సత్యాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల గురించి, ప్రజలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఈ పుస్తకంలో తెలియజేశానన్నారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎస్ బ్రహ్మానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిలంకూరులో స్థానిక నాయకులతో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు పథకాలను అందించామన్నారు. ఎన్నిక మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చి, చరిత్ర సృష్టించారన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చేందుకు ఆయన ఆవిష్కరించిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. చాలా రాష్ట్రాలు మన రాష్ట్రంలోని గ్రామ సచివాలయ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనే ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, గ్రామ సర్పంచ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాపు సామాజిక వర్గానికి సముచిత స్థానం



మాట్లాడుతున్న రాయల్ కాపునాడు సంఘ ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజ

వేంపల్లె : రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాయల్ కాపునాడు సంఘం ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజ తెలిపారు. సోమవారం స్థానిక గండి క్షేత్ర సమీపంలోని హరిత హోటల్ వద్ద కాపు నేతలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మూడు రోజుల క్రితం కడపలో కొందరు కాపు నేతలు వైఎస్సార్‌సీపీకి మేము మద్దతు ఇవ్వమని, అన్యాయం జరుగుతుందన్నట్లు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి రాయల్ కాపు నాడు సంఘం, బలిజ కమ్యూనిటీ నుంచి పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత సి.రామచంద్రయ్యను ఎమ్మెల్సీన, సింగసాని గురుమోహన్‌ను ఉడా చైర్మన్ పదవులు కల్పించిందన్నారు. అలాగే మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రతోపాటు ఇతర ఆయా శాఖల్లో డైరెక్టర్ పదవులు ఇచ్చి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ పదవిని బలిజ సామాజిక వర్గానికి ఇవ్వడం జరిగిందన్నారు. అటు రాజకీయాల్లో, ఇటు ప్రాముఖ్యత పదవుల్లో సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటే ప్రతి బలిజ సోదరుడు ఉంటారని వ్యక్తం చేశారు. అయితే బలిజ సామాజిక వర్గానికి చెంది ఎలాంటి ప్రజా సంబంధాలు లేని కొందరు వ్యక్తులు కులాన్ని పార్టీకి ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు. పబ్బం గడుపుకునేందుకు తప్పుడు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ఉచ్చులో పడి కులాలకు, మతాలకు మధ్య చిచ్చుపెట్టి బలిజ కాపులను అవమానపరడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి దుష్ప్రచారాన్ని మానుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో రాయల్ కాపునాడు సంఘం అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, వేంపల్లె బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, సీనియర్ నేతలు కావలి హరినాథ్, వెంకటేశ్వర్లు, రాయల్ కాపునాడు మహిళా అధ్యక్షులు సంగా హేమలత, రామ్మోహన్, సోమశేఖర్, పోతిరెడ్డి సావిత్రి, చక్రాయపేట సంఘ మండల అధ్యక్షుడు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం అవసరం

కడప కల్చరల్ : సంప్రదాయ క్రీడలు మన జిల్లాకు వారసత్వ సంపదలని, వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని కడప రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల నారాయణరెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న 2024 సంక్రాంతి సంప్రదాయ సంబరాల్లో భాగంగా మూడవరోజు సోమవారం కడప నగరం రాజీవ్ మార్గ్‌లోగల శివశివాని హైస్కూలు ఆవరణలో కర్రసాము, తాడు లాడుగు పోటీ (టగ్ ఆఫ్ వార్) లను నిర్వహించారు. ఎనిమిది మహిళా బృందాలు, ఏడు పురుషుల బృందాలు టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో సిసింద్రి జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ.15 వేల నగదును పొందారు. నాగాయపల్లె జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదును పొందారు. మహిళా విభాగంలో కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల జట్టు మొదటి బహుమతి, జేసీఎన్ అకాడమి జట్టు రెండవ బహుమతి సాధించాయి. కర్రసాము పోటీల్లో 24 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో హేమంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలువగా, ఏజే ప్రసాద్, కె.ధనుష్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో పి.చంద్రకళ. పి.దీప్తికుమారి, ఎస్.శ్వేతాంజలి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను గుర్తించడం కోసం ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర కార్యాక్రమాన్ని విజయవంతం చేద్దామని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను సచివాలయ పరిధిలో నిర్వహించారు. పతంగే రామన్నరావు, బాలికల జూనియర్ కాలేజ, రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న డిగ్రీకాలేజి క్రీడా మైదానాలలో ఈ క్రీడలను నిర్వహిస్తారన్నారు. ప్రతి క్రీడాకారుడు ఈ పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లింగాలలో..

లింగాల : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ పోటీలలో మండలంలోని అన్ని సచివాలయ పరిధిలోని గ్రామాల క్రికెట్ జట్లు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ పుష్పలు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన తెలిపారు.

నేడు కాశినాయన ఆరాధన మహోత్సవాలు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని ఎస్.పాలగిరి క్రాస్‌లోని మొగమూరు వాగు సమీపంలో వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో మంగళవారం 28వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పూజా కార్యక్రమాలు, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు భజన కార్యకమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు వేంపల్లె అంజని ఈవెంట్స్ వారిచే పాటలు, జబర్దస్త్ టీమ్ వారిచే కామెడి, మిమిక్రీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి న్యూ కేటగిరి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. భక్తులకు అమ్మ ఒడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : స్థానిక రాజీవ్‌కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమంలో సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో దేశ ప్రధానమంత్రి వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అందరికి పండ్లు పంపిణీతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కాశ్మీర్ నుండి కన్యా కుమారి వరకు, లడాక్ నుండి కటక్ వరకు స్వర్ణ చతుర్భుజి ఆకారంలో అతిపెద్ద జాతీయ రహదారులతోపాటు గ్రామీణ ప్రాంతాలకు రహదారులు నిర్మించడం జరిగిందన్నారు. అలాగే ఫోఖ్రాన్‌లో అణు పరీక్షలు విజయవంతంగా నిర్వహించి ప్రపంచ దేశాలకు భారత దేశ అణు శక్తి సామర్థ్యాలను తెలియజేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు లింగాలలో ఆయన చిత్ర పటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలను మండలంలోని నాగలగుట్టపల్లెలో సోమవారం ఘణంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాగలగుట్టపల్లెలోని జనజాగృతి గ్రామీణ గ్రంథాలయం వద్ద ఆయన వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల యువ మోర్చా అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు సోము తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



బాధితుడి కుటుంబానికి రూ.40వేల చెక్కును అందిస్తున్న ఆర్‌సీడీఎస్ సొసైటీ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : రెండు కిడ్నీలు చెడిపోయి బాధపడుతున్న నగరిగుట్టకు చెందిన నంద్యాల నారాయణరెడ్డి ఆపరేషన్ ఖర్చుల కోసం ఆయన భార్య పద్మావతికి రూ.40వేల చెక్కును ఏపీ ఆర్‌సీడీఎస్ సొసైటీ ప్రతినిధులు ఆర్థిక సాయంగా సోమవారం స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో అందజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి, ఆర్సీరెడ్డి, బంటెద్దు రామలింగారెడ్డిలు మాట్లాడుతూ రెడ్డి కుటుంబం ఎల్లవేళలా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే రెడ్డి కమ్యూనిటీ సొసైటీ సభ్యుల సహకారంతో రూ.25వేలు, పులివెందులకు చెందిన సప్తగిరి హోటల్ యజమాని కంభం జగదీశ్వరరెడ్డి, రెడ్డి కమ్యూనిటీ కోశాధికారి రామలింగారెడ్డిలు వ్యాధిగ్రస్తుడికి రూ.5వేల చొప్పున నగదును వితరణగా అందించారు. ఆర్‌సీడీఎస్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న కోలా ప్రసాద్

పులివెందుల రూరల్ : క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలోని క్రిష్టియన్ లైన్ కాలనీలో నివాసముంటున్న సుమారు 60 మంది కుటుంబాలకు సోమవారం నేషనల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకుని సేవా కార్యక్రమాలు చేపట్టి తన వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు.

శిల్పారామంలో క్రిస్మస్ సంబరాలు



గ్రూప్ డ్యాన్స్‌లో చిన్నారులు



వెస్ట్రన్ డ్యాన్స్‌లో యువకుల సందడి

పులివెందుల టౌన్ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శిల్పారామంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం సాయంత్రం శ్రీభైరవేశ్వర ఎంటర్‌ప్రైజెస్, రుచి రెస్టారెంట్ సంయుక్త సహకారంతో విజయవాడ ఎక్సలెంట్, నాగార్జున ఇంగ్లీషు మీడియం పాఠశాలల విద్యార్థులు డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ తాత వేషధారణలో ప్రతి ఒక్కరిని పలకరిస్తూ క్రిస్మస్ పండుగ ఉట్టి పడేలా ఆకట్టుకున్నాయి. చిన్నారుల కేరింతల మధ్య శిల్పారామం సందర్శకులు వచ్చి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



సందర్శకులను పలకరిస్తున్న క్రిస్మస్ తాత వేషధారుడు